# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 12-09-2024 సంపుటి : 06 సంచిక : 354 పేజీలు : 8 వెల : రూ 3-00







## ఏపీలో అక్టోబర్ నుంచి నూతన మద్యం పాలసీ : మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ప్రజలకు తక్కువ ధరకు, నాణ్యమైన మద్యాన్ని విక్రయించేందుకు మద్యం పాలసీని తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడలో భేటీ అయ్యింది.అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ ఆరు రాష్ట్రాల్లోని మద్యం పాలసీలను అధ్యయనం చేస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసిందని, రాష్ట్ర ఆదాయనికి గండిపడేలా మద్యం పాలసీని తీసుకువచ్చిందని ఆరోపించారు.

**ప్రతీ ఒక్కరికి అండగా ఉంటానని సిఎం బాబు హామీ**
**పంట నష్టం ఎకరాకు రూ. 10వేలు అందిస్తాం,**
**వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి అండగా ఉంటాం**

# మీ కష్టం వెనుక నేనుంటా





ఏలూరు, (సెప్టెంబర్, 11 ) వరదలలో నష్టపోయిన ప్రతీ ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఏలూరు జిల్లాలో వరదల నష్టాన్ని బుధవారం హెలికాప్టర్ లో ఏరియల్ సర్వే ద్వారా ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం ఏలూరులోని సర్ సి.ఆర్.రెడ్డి డిగ్రీ కలసి ఆడిటోరియం లో కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరద పరిస్థితిపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. అనంతరం బాధితుల కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి





చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వరదల కారణంగా జరిగిన ప్రతీ నష్టాన్ని పారదర్శకతతో, జవాబుదారీతనంతో లెక్కిస్తామన్నారు. మీ కష్టాలను కళ్లారా చూశానని, వరదల కారణంగా నష్టపోయిన ప్రతీ ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటామన్నారు. వరిపంట వేసిన రైతులు 70 రోజులు తర్వాత చేతికి పంట వచ్చే సమయంలో కోల్పోతే ఆరైతు భాద వర్ణనాతీతమన్నారు. వరి పంట నష్టపోయిన రైతాంగానికి 2019 కి ముందు తాము హెక్టారుకు 16 వేల రూపాయలు పరిహారం అందించామని, గత ప్రభుత్వం కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచిందన్నారు. అయితే తాము ఈసారి హెక్టారుకి పంటనష్టం రూ. 17 వేలు నుంచి రూ. 25 పెంచి అందిస్తామని రైతులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వరికి ఎకరాకు రూ. 10 వేలు పంటనష్ట పరిహారం ఇస్తామన్నారు. పంట సాగుచేసే వారిలో 70 శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారని, వారికి అండాగా ఉండేలా ఇన్ పుట్ సబ్సిడీని నేరుగా కౌలు రైతుల అక్కౌంట్ లోకి జమచేస్తామన్నారు. వ్యవసాయరంగం, ఉధ్యానరంగంలో వరదల కారణంగా నష్టపోయిన రైతులకు, పశువులు చనిపోయి, ఇళ్లుకూలి నష్టపోయిన ప్రతి ఒక్కరికి కలిగిన నష్టాన్ని ఈనెల 17వ తేదీలోపు సర్వే చేసి, పరిహారం అందించడంపై సరిచేసిన విధివిధానాలను రూపొందిస్తామన్నారు. భవిష్యత్తులో వరదలు, తూఫానులు వంటి వైపరీత్యాలను మరింత సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. వరదలు మాపింగ్ చేస్తామన్నారు. పై ప్రాంతాలలో వరదలు దిగువ ప్రాంతాలలోకి వచ్చేలోగా ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసే దిశగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని నష్టాలను నివారిస్తామన్నారు. కృష్ణానదిలో ఊహించని వరదవచ్చి నిన్నటికి 10 రోజులు అయిందని, గత ప్రభుత్వం తప్పిదాల వల్ల బుడమేరు ఇంతలా ఉప్పొంగి ప్రజలు కష్టాలపాలు అయ్యారన్నారు. ఎక్కడచూసినా బుడమేరు ఆక్రమణలు, మరోవైపు గత 5 ఏళ్ల వైసిపి పాలనలో డ్రైన్ల మరమ్మత్తులు చేపట్టకుండా, కాల్వలు త్రవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. బుడమేరు ఆధునీకరణకు గతంలో తాము అనుమతులు ఇస్తే రాజకీయ కారణాలతో వాటిని క్యాన్సిల్ చేసి బుడమేరు మొత్తం ఆక్రమణకు గురిచేసారన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. మరోవైపు 11 లక్షల 90 వేల క్యూసెక్కుల నీరు డిశ్చార్జి కేపాసిటీ ఉండేలా ప్రకాశం బ్యారేజిని 70 ఏళ్ల క్రితం నిర్మించబడిందన్నారు. ఆతర్వాత కాలంలో బ్యారేజీ ఎగువన ఎన్నో ప్రాజెక్టులు వచ్చాయని అయినా ఇంత భారీ స్థాయిలో వరద వచ్చిందంటే అది వాతావరణంలో వస్తున్న పెనుమార్పులకు కారణమన్నారు. బడుమేరులో 5 రోజులు ఇరిగేషన్ మంత్రి నిమ్మలరామానాయుడు అక్కడే వుండి గండ్లుపూడ్చే కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. కాబట్టే వరదను కంట్రోల్ చేయగలిగామన్నారు. అలాగే రాత్రంబవళ్లు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధ ఎంతో కష్టపడ్డారన్నారు. వరద సహాయ చర్యల్లో కష్టపడిన ప్రతిఒక్కరికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. 11 లక్షల 40 వేల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజికి వస్తుంటే 5 టన్నుల బరువుఉండే మూడు బోటులను ఒకదానికొకటి తాడు కట్టి వదిలారని దీనితో బ్యారేజి దెబ్బతినివుంటే లంక గ్రామ ప్రజల పరిస్థితి ఏమయ్యేదని అన్నారు. తమ హయాంలో రౌడీలు లేకుండా చేశామని రాయలసీమలో ముఠానాయకులు లేకుండా ఛేశామని అదే విధంగా మత విధ్వేషాలు లేకుండా మెరుగైన పాలన అందించామన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లో తనపై బాంబులతో దాడి చేసినా ప్రజల కోసం ప్రాణాలను పట్టించుకోకుండా ముందుకు వెళ్లామన్నారు. గత ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులకు రాష్ట్ర సంపాదన వడ్డీకి కూడా సరిపోని పరిస్థితిని తెచ్చారన్నారు. గోదావరి జిల్లాలు ఎప్పుడూ తమకు అండగా ఉన్నాయన్నారు. పోలవరం రాష్ట్రానికి ఒకవరమని ఆయన పేర్కొంటూ పోలవరం పూర్తయి నదులు అనుసంధానం చేస్తే రాష్ట్రానికి కరువు అనేది ఉండదన్నారు. పోలవరం నిర్మాణానికి రూ. 12 వేల కోట్లు కేంద్రంతో ఒప్పించి విడుదల చేయించామన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో ఏపీ డిప్యూటీ సీఎం భేటీ..

### రూ. కోటి విరాళాన్ని అందించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం రూ. కోటి విరాళాన్ని ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఆ సహాయార్థానికి సంబంధించిన చెక్కును నేడు సీఎం రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ అందజేశారు. అనంతరం ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, ఇతర అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయనతో పవన్ భేటీ కావడం ఇదే తొలిసారి.తెలుగు రాష్ట్రాలకు పవన్ కల్యాణ్ రూ. 6 కోట్ల ఆర్థిక సాయాన్ని సెప్టెంబర్ 4న ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ, ఏపీకి రూ. కోటి చొప్పున, మిగతా రూ. 4 కోట్లు



ముంపునకు గురైన 400 గ్రామాల్లో సహాయక చర్యల నిమిత్తం ప్రకటించిన విషయం విదితమే.

## ఉపాధి హామీ పనులను గడువులోగా పూర్తి చేయండి


### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల :11-09-2024,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, 100 రోజుల పనిదినాల కల్పన, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, సంస్థాగత ప్లాంటేషన్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఫారం పాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పశుసంపద షెడ్లు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై డ్వామా పిడి రామచంద్రారెడ్డితో కలసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్ లో జూపాడుబంగ్లా, కొత్తపల్లి, మిడుతూరు, పాములపాడు తదితర మండలాలు లక్ష్యసాధనలో వెనుకబడి వున్నాయని మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని



కలెక్టర్ ఆదేశించారు. ప్లాంటేషన్ కు సంబంధించి మిడుతూరు, ప్యాపిలి, డోన్, బేతంచర్లలో లక్ష్యాన్ని చేరుకోలేదని ఈ వారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారం పాండ్ల త్రవ్వకంలో కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ తదితర మండలాల్లో పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి ఏపీడీలు ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తూ పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు.

## ఎలక్ట్రానిక్స్ రంగంలో అందుబాటులోకి రానున్న 60 లక్షల ఉద్యోగాలు : మోదీ




న్యూఢిల్లీ: దేశీయంగా పెద్దసంఖ్యలో చిప్స్ తయారీపై భారత్ ప్రస్తుతం దృష్టిసారించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నదని చెప్పారు. గ్రేటర్ నోయిడాలో బుధవారం ఇండియా ఎక్స్పోమార్ట్‌లో సెమీకాన్ ఇండియా 2024ప్రారంభ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. సెమీకండక్టర్‌మ్యాన్యు ఫ్యాక్చరింగ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలతో బాసటగా నిలుస్తున్నదని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానాలతో భారత్‌లో లక్షన్నర కోట్లకు పైగా విలువైన పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఎలక్ట్రానిక్ రంగ మార్కెట్ 150 బిలియన్ డాలర్లకు పైగా ఉందని, దీన్ని మరింత పెంచాలనేది తమ లక్ష్యమని ప్రధాని వివరించారు.ఈదశాబ్ధం చివరికి మన ఎలక్ట్రానిక్ రంగం 500 బిలియన్ డాలర్ల స్థాయికి ఎదగాలనే లక్ష్యం నిర్ధేశించుకున్నామని తెలిపారు. దీంతో భారత యువత కోసం ఈ రంగం నుంచి ఏకంగా దాదాపు 60 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. నైపుణ్యాలు సంతరించుకుంటే పెద్దసంఖ్యలో ఉపాధి అవకాశాలు మన యువతకు పుష్కలంగా లభిస్తాయని మోదీ వివరించారు.

## రెడ్‌బుక్ మీకే సొంతం అనుకోవద్దు.. అధికార పార్టీ నాయకులకు వైఎస్ జగన్ హెచ్చరిక

అమరావతి : ఏపీలో టీడీపీ నాయకులు అమలు చేస్తున్న రెడ్ బుక్ మీకే సొంతమని అనుకోవద్దని వైసీపీ అధినేత, మాజీ సీఎంవైఎస్ జగన్ అన్నారు. మీ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు. టీడీపీ నాయకులు జైలుకు వెళ్లక తప్పదని అధికార టీడీపీనాయకులను హెచ్చరించారు. గుంటూరు జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగాం సురేష్‌ను పరామర్శించిన అనంతం జైలు బయట మీడియాతో మాట్లాడారు.రెడ్ బుక్ పేరిట తప్పుడు సంప్రదాయానికి బీజం వేస్తున్నారని, ఈ తప్పుడు సంప్రదాయం రాబోయే రోజుల్లో సునామీలా వస్తుందని, ఆరోజు ఇదే జైల్లో మీవాళ్లందరూ ఉంటారని హెచ్చరించారు.మీ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, ఇవన్నీ తాత్కాలికమే, మీరు భూస్థాపితం అయ్యే రోజులు వస్తాయని అన్నారు. విజయవాడ వరదలను డైవర్ట్ చేయాలని బోటు వివాదం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై మండిపడ్డారు.ప్రకాశం బ్యారేజీ కి కొట్టుకొచ్చిన బోట్లను రాజకీయం చేయాలని చూస్తున్నారని, బోట్లకు పర్మిషన్ ఇచ్చింది చంద్రబాబేనని విమర్శించారు. చంద్రబాబు సీఎం కాగానే ఈ బోట్లతో విజయోత్సవ ర్యాలీలు చేపట్టారని పేర్కొన్నారు. నాలుగు నెలల నుంచి బోట్లు అక్కడే ఉన్నాయని, బోటు నిందితుడు ఉషాద్రి టీడీపీకి చెందిన వ్యక్తేనని ఆరోపించారు.రాష్ట్రానికి తుఫాన్ వస్తుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించినా కూడా ముఖ్యమంత్రి అధికారులతో రివ్యూ చేయలేదని పేర్కొన్నారు. హోంశాఖ లోతట్టు ప్రాంతాల్లోని వారికి అలర్ట్ జారీ చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.



# సంపాదకీయం

గురువారం 12-09-2024


## వైద్యుల సమ్మెకు పరిష్కారమెప్పుడు

కోల్‌కతా ఘటనలో జూనియర్ వైద్యుల కోణం లోనూ, ప్రజల కోణంలోనూ చూస్తే, తమ తోటి స్టాఫ్ అయినా ఒక వైద్యురాలు అత్యంత వేదనాభరితంగా, నిస్సహాయ స్థితిలో లైంగిక దాడికి గురై ప్రాణాలను కోల్పోయింది. ఇది వైద్యులు, ప్రజలు జీర్ణం చేసుకోలేకపోతున్నారు. పోలీసుల నుండి, ప్రభుత్వం నుండి మానవత్వంతో కూడిన స్పందన రావాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా కొన్ని ప్రయత్నాలు జరగడం జూనియర్ వైద్యులకూ, తీవ్రమైన దిగ్భ్రాంతిని కలిగించాయి. సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాల్సింది. కానీ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయకుండా మరో మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది. దాంతో పాటు, బాధితురాలు ఆత్మహత్య చేసుకుందని ఆత్మహత్య కథనాలు అల్లి శవ దహనం కూడా వీలైనంత వేగం చేయించేసి డబ్బు ఆశ కూడా చూపించే ప్రయత్నాలు జరిపించడం పట్ల జూనియర్ వైద్యులకు విపరీతమైన కోపం ఉంది. అత్యాచారాలకు వ్యతిరేకంగా బలమైన చట్టం చేసినంత మాత్రాన ఇవి పరిష్కారం కావు. తమ డిమాండ్లు నెరవేరే వరకు, బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ' "కోల్‌కతా పోలీస్ కమిషనర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య సేవల విభాగం డైరెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లను తొలగించాలి" అని వారు డిమాండ్ చేశారు. మహిళలను గౌరవించే సామాజిక, సాంస్కృతిక విప్లవం నిరంతరం జరగాలి. ప్రభుత్వం కోణంలో చూస్తే, వైద్యులు హాస్పిటల్‌కి చాలా అవసరం. పేదలే ప్రభుత్వాసుపత్రులకు వస్తారు. డబ్బున్న వారూ, మధ్యతరగతి సాధారణంగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తారు. జూనియర్ వైద్యుల సమ్మె హాస్పిటల్ సేవలో సమస్యలను తెచ్చి పెట్టింది. రోగులు సరైన ట్రీట్మెంట్ లేక నిస్సహాయ స్థితిలో పడిపోవడం కూడా జరుగుతుంది. ఓపిడీలలో సరైన ట్రీట్మెంట్ దొరకడం లేదు. ఈ కారణాలన్నీ చూపిస్తూ, ప్రభుత్వం జూనియర్ వైద్యుల్నీ, మెడికల్ ట్రైనీలనూ వెంటనే తమ పనుల్లో చేరమని అభ్యర్థిస్తోంది. ఇక ప్రభుత్వం తరపున వాదన ఏమిటంటే, పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసు సీబీఐ చేతుల్లోకి వెళ్లింది. సీబీఐ తన పని తాను చేసుకుంటోంది. కోర్టుల ఆధ్వర్యంలో కేసు నడుస్తోంది. మహిళల మీద అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం శాశ్వత పరిష్కారాల కోసం అపరాజిత చట్టాన్ని కూడా వీలైనంత తక్కువ సమయంలో తీసుకొచ్చింది. మహిళల సెక్యూరిటీ కోసం పాలనా పరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంది. మహిళా పోలీసుల్ని రాత్రి వేళల్లో నియమించబోతోంది.దాదాపు 7,000 మంది మూక ఆగస్టు 14 రాత్రి హాస్పిటల్ మీద పడి జూనియర్ వైద్యులను భయభ్రాంతులకు గురి చేశారు. ఇదంతా కూడా పాలనా యంత్రాంగం ఆశీర్వాదం లేకుండా జరుగుతుందా ? అన్న ప్రశ్న జూనియర్ వైద్యులకు మాత్రమే కాదు, ప్రజలకు కూడా వస్తోంది. అందుకే, జూనియర్ వైద్యులు సంబంధిత ప్రిన్సిపల్‌ని సస్పెండ్ చేయమని కోరుతున్నారు. అలానే, పూర్తిగా వైఫల్యం చెందిన పోలీస్ కమిషనర్‌ను కూడా తొలగించమని కోరుతున్నారు. దాంతో పాటు బాధితురాలికి జరిగిన అన్యాయం పట్ల సరైన న్యాయబద్ధమైన పరిష్కారం కోరుతున్నారు. ప్రభుత్వం నుండి సంతృప్తికరమైన సమాధానం రానంతవరకు సమ్మె ఆగేది లేదని జూనియర్ వైద్యులు చెబుతున్నారు. ఈ రెండు ఇలా ఉంటే, దగ్గర్లో దుర్గా పూజా కారణంగా అతిపెద్ద మార్కెట్ మిస్ చేసుకుంటున్న వ్యాపార వర్గాలు అత్యంత ఆందోళనలో ఉన్నాయి. దుర్గా పూజ ఒక పూజ మాత్రమే కాదు. కొన్ని వేల కోట్ల రూపాయల వ్యాపారం. ఈ వర్గం కూడా అత్యంత ఆవేదనలో ఉంది. ఈ వ్యాపారం మీద ఎన్నో వేలమంది ఉపాధి కోసం ఆధారపడి ఉన్నారు. అందుకే ఈ వర్గం కూడా కోపంతో ఉంది.సుదీర్ఘ కాలంలో ఏ ప్రభుత్వం ఉన్నా సరే, ఏ పార్టీ ఉన్నా సరే అనైతిక శక్తులు, అవినీతికర శక్తులు ఆ పార్టీలో ప్రవేశించడం, ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగించడం మనకు తెలిసిందే. నేడు బెంగాల్‌లో కూడా అదే కనిపిస్తుంది. ఉపాధ్యాయుల నియామకం విషయంలో విపరీతమైన అవినీతి ఇంతకుముందు చూశాం. అప్పుడైనా సరే, పాలకవర్గం జాగ్రత్త పడాల్సింది. దాంతో పాటు హాస్పిటల్లలోనూ, రోడ్లమీద పర్మనెంటు పోలీసుల నిర్వహణ తగ్గి, కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డ్స్ నియామకం పెరిగింది. సివిక్ వాలంటీర్ల నియామకం పెరిగింది. వీరి జీతాలు చాలా తక్కువ. ఒక పెద్ద మెడికల్ కాలేజ్ పర్మనెంట్ పోలీసుల నిర్వహణలో ఉండడం వేరు. చూసీ చూడని కాంట్రాక్టు గార్డుల నియామకంలో, నిర్వహణలో ఉండడం వేరు. మన పాలకవర్గాలు చాలా రాష్ట్రాల్లో ప్రజలకు ఉచితాలను అలవాటు చేసి ప్రజల్లో ప్రశ్నించే స్వభావం, నిరసించే గుణం తగ్గించేశారు. ఇలాంటి ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలు ప్రపంచ బ్యాంకు సలహాలతో ముందుకు నడుస్తాయి. కాబట్టి, మనం వుయ్ వాంట్ జస్టిస్ అన్నప్పుడు ఒకవైపు బాధితురాలికి సరైన న్యాయం అందాలి. మరోవైపు, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతి హాస్పిటల్‌లోనూ సెక్యూరిటీలో కాంట్రాక్టు ఉద్యోగులను పూర్తిగా తగ్గించి పర్మనెంట్ పోలీసుల చేతుల్లోకి వెళ్లాలి. అందుకోసం, పోలీసుల నియామకాలు యుద్ధ ప్రాతిపదికన జరగాలి.మహిళల మీద అత్యాచారాలకు వ్యతిరేకంగా బలమైన చట్టం చేసినంత మాత్రాన ఇవి పరిష్కారం కావు. ప్రజా వ్యతిరేక విధానాలను తొలగించి, ప్రజానుకూల విధానాలు రావాలి. అలానే, ప్రజల్లో సామాజిక, సాంస్కృతిక చైతన్యం పెరగాలి. మహిళల పట్ల చులకన భావం, మహిళలని అవమానించే భాష వాడకం తగ్గాలి. అవతలి మహిళను గౌరవించే సంస్కృతి పెరగాలి. అందుకు నిరంతరంగా సాంస్కృతిక రంగంలో మార్పు జరగాలి. సినిమాల్లో హీరోల ప్రవర్తన హీరోయిన్ పట్ల అత్యంత చులకన భావంతో ఉంటుంది. వాడే భాష కూడా అలాగే ఉంటుంది.

# వలస ఎమ్మెల్యేలల్లో వణుకు...

వరంగల్, సెప్టెంబర్ 11, (న్యూస్ పల్స్) హైకోర్టు ఆదేశాలతో తెలంగాణలో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలనే హైకోర్టు ఆదేశాలు?. వలస ఎమ్మెల్యేల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కాలయాపన జరిగినట్లు.. ఇప్పుడు కూడా పదవీకాలం పూర్తయ్యేవరకు గడిపేయొచ్చని భావించిన ఎమ్మెల్యేలకు హైకోర్టు తీర్పుతో ఎదురుదెబ్బ తగిలినట్లైంది. వేటు కత్తి వేలాడుతుండటం? చట్ట ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకుంటే? మూడు అసెంబ్లీ స్థానాలకు ఆరు నెలల్లోనే ఉప ఎన్నిక అనివార్యమయ్యే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఐతే స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సస్పెన్స్‌గా మారగా, హైకోర్టు తీర్పుతో పర్యావసానాలపై మిగిలిన ఏడుగురు వలస ఎమ్మెల్యేలు టెన్షన్ పడుతున్నట్లు చెబుతున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకొని ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేయాలని చూసిన కాంగ్రెస్ పార్టీ లక్ష్యం నెరవేరలేదు. ఇప్పుడు తాజాగా హైకోర్టు ఇచ్చిన డైరెక్షన్ అధికార పార్టీకి ఝలక్ ఇచ్చినట్లైందంటున్నారు. బీఆర్ఎస్ నుంచి మొత్తం 26 మందిని కాంగ్రెస్‌లోకి చేర్చుకోవాలని ప్రభుత్వ పెద్దలు ప్లాన్ చేయగా, ప్రస్తుతానికి 10 మంది మాత్రమే హస్తం గూటికి చేరారు. ఐతే వీరిలో ముగ్గురిపై తక్షణం చర్యలు తీసుకోవాలని గతంలోనే స్పీకర్‌కు, ఆ తర్వాత హైకోర్టుకు నివేదించింది బీఆర్ఎస్. అనర్హత వేటు వేయడంలో తాత్సారం చేస్తున్న స్పీకర్ తక్షణం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించాల్సిందిగా కోరుతూ హైకోర్టుకు వెళ్లింది బీఆర్ఎస్.ఆ పార్టీ అనుకున్నట్లే అనర్హత వేటుపై తీసుకోబోయే చర్యలకు సంబంధించి షెడ్యూల్ రూపొందించి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ అసెంబ్లీ కార్యదర్శికి కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో కాంగ్రెస్ పెద్దలు కంగుతిన్నారు. పార్టీ మారిన ఈ ముగ్గురు ఎమ్మెల్యేలను ఎలా కాపాడుకోవాలనే వ్యూహ రచన చేస్తున్నారు. మరోవైపు కారు దిగిన మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలకు ఏ రకమైన భరోసా ఇవ్వాలన్నదానిపై అధికార పార్టీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారట.ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి 10 మంది కాంగ్రెస్‌లోకి జంప్ చేయగా, వీరిలో ముగ్గురిపై ఏదో ఒక నిర్ణయం వెల్లడించాలని స్పీకర్‌ను ఆదేశించింది హైకోర్టు. దీంతో ఈ ముగ్గురితోపాటు మిగిలిన ఏడుగురు టెన్షన్ పడుతున్నారని అంటున్నారు. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ లో చేరారు. కడియం శ్రీహరి కుమార్తెకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇప్పించుకోగా, దానం నాగేందర్ ఏకంగా సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి దొరికిపోయారు. అటు తెల్లం వెంకట్రావు సైతం లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించారు. దీంతో ఈ ముగ్గురిని టార్గెట్ చేసింది గులాబీదళం. వీరిపై కోర్టును ఆశ్రయించి.. అనర్హత వేటు వేయించేందుకు వాదనలు విన్పించింది బీఆర్ఎస్. దీంతో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలనే రకంగా డైరెక్షన్ ఇచ్చింది హైకోర్టు.ఇంకా డివిజన్ బెంచ్ కు వెళ్లేందుకు ? సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సైతం ఎమ్మెల్యేలకు అవకాశం ఉన్నా? అది పెద్దగా ఉపయోగ ఉండకపోవచ్చనే వాదనే విన్పిస్తోంది. గతంలో మహారాష్ట్ర ఎమ్మెల్యేల విషయంలో ఇదే రకంగా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు సైతం డైరెక్షన్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు న్యాయనిపుణులు. దీంతో ఈ ముగ్గురిపై వేటు ఖాయమని.. ఉప ఎన్నికలు తప్పవనే చర్చ జోరుగా సాగుతోంది. అదే జరిగితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు చెరో స్థానాన్ని గెలుచుకునే అవకాశాలున్నాయనే ఊహాగానాలు సాగుతున్నాయి.ఇదిలా ఉంటే మిగిలిన ఏడుగురిపై మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి ఆధారాలను బీఆర్ఎస్ కు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు ఫిరాయింపు ఎమ్మెల్యేలు? బహిరంగంగా ఎక్కడా కాంగ్రెస్ కు మద్దతు పలికినట్లు కనపడకుండా? ప్రభుత్వాన్ని భుజాన మోస్తున్నారు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరిపై వేటు పడినా, మిగిలిన వారందరూ అదే శిక్షను ఎదుర్కోవాల్సి వుంటుంది. ఈ పరిస్థితుల్లో ఎవరు బలైపోతారోనని పార్టీ మారిన ఎమ్మెల్యేలు భయపడుతున్నట్లు చెబుతున్నారు.వేటు నుంచి తప్పించుకోవాలంటే ముందుగా రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్లడం ఒక్కటే ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయంగా చెబుతున్నారు. ఐతే పార్టీ మారిన 10 మందిలో ఒకరిద్దరికి తప్ప మిగిలిన నేతలు అందరికీ నియోజకవర్గంలో పరిస్థితులు అంత సానుకూలంగా లేవంటున్నారు. దాదాపు అందరూ కాంగ్రెస్ క్యాడర్ నుంచి సహాయ నిరాకరణ ఎదుర్కొంటుండటం వల్ల తమ పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యి అన్నట్లు తయారైందని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు ఎమ్మెల్యేలు. జంపింగ్ ఎమ్మెల్యేల్లో దాదాపు అందరూ వ్యతిరేకత ఎదుర్కొంటుండం వల్ల ఉప ఎన్నికలను ఎదుర్కొనే విషయంపై తర్జనభర్జన సాగుతోంది.గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి ఇన్‌చార్జి సరితా తిరుపతయ్యతోను, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోనూ విభేదాలు కంటిన్యూ అవుతున్నాయి. అదే విధంగా చేవెళ్లలో ఎమ్మెల్యే యాదయ్యకు, కాంగ్రెస్ నేత భీం భరత్ కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. ఇక మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డికి పొసగడం లేదు. దీనికితోడు ఇప్పుడు అనర్హత కత్తి వేలాడుతుండటం వల్ల? ఈ క్లిష్ట పరిస్థితి నుంచి ఎలా బయటపడాలనేదే జంపింగ్ ఎమ్మెల్యేలకు పెద్ద టాస్క్‌గా మారిందంటున్నారు.


## అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి కలిశారు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై తాము వేసిన పిటిషన్‌పై హైకోర్టు వెలువరించిన తీర్పు అమలుకు చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీకి పిటిషన్ సమర్పించారు.దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని హైకోర్టు చెప్పింది. అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాలి అంటే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి. కాలయాపన చేయకుండా చర్యలు ప్రారంభించాలని అసెంబ్లీ సెక్రటరీకి వినతిపత్రం ఇచ్చామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు.'పార్టీ మారి తప్పు చేశామా?'- ఇదీ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల్లో మొదలైన అంతర్మథనం. 'నిన్నమొన్నటిదాకా ఏం కాదులే అనుకున్నాం. కానీ, హైకోర్టు తీర్పుతో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏంచేయాలో అర్థం కావడం లేదు. ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్టే ఉన్నది' అని పార్టీ మారిన ఎమ్మెల్యే ఒకరు తన సన్నిహితులతో వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని, ఆ పార్టీ శ్రేణులు సహకరించడం లేదని, మరోవైపు బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నదని ఈ పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు వస్తే తట్టుకొని నిలబడటం కష్టమని సదరు ఎమ్మెల్యే మథనపడుతున్నారని ఆయన అనుచరులు బాహాటంగానే చెప్తున్నారు. గద్వాల, భద్రాచలం, స్టేషన్‌ఘన్‌పూర్, జగిత్యాల, బాన్సువాడ, చేవెళ్ల, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, రాజేంద్రనగర్ ఈ పది నియోజకవర్గాల్లో హైకోర్టు తీర్పు హాట్‌టాపిక్‌గా మారింది.

## వియత్నాంలో విషాదం.. 140 మందిని బలిగొన్న యాగీ టైఫూన్

వియత్నాం లో యాగి తుపాను బీభత్సం సృష్టిస్తున్నది. భారీ వర్షం బలమైన ఈదురుగాలులు కొండచరియలు విరిగిపడటం పోటెత్తిన వరదలు ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ టైఫూన్ ధాటికి ఆ దేశంలో ఇప్పటికే 140 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 59 మంది గల్లంతయ్యారు.వియత్నాం వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించింది. మృతుల్లో 29 మంది కావో బ్యాంగ్ ప్రావిన్స్‌కు చెందిన వారు, 45 మంది లావో కై ప్రావిన్స్‌కు చెందిన వారు, 37 మంది యెన్ బాయి ప్రావిన్స్‌కు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. అయితే క్యూయెట్ థాంగ్ కమ్యూన్ గుండా ప్రవహించే డైక్ నదికి భారీ నీటి ప్రవాహం పోటెత్తడంతో వరద ముంచెత్తింది. ఈ విషయాన్ని తుయెన్ క్వాంగ్ ప్రావిన్స్ స్థానిక అధికారులు ధ్రువీకరించింది. రాజధాని హనోయిలోని ఎర్ర నదిపై వరద స్థాయి వ ం ా ఢ ో



హెచ్చరికలను దాటింది. బుధవారం మధ్యాహ్నానికి అత్యధిక స్థాయికి చేరుకుంటుందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. అలాగే థావో నది నీటి మట్టం పెరిగి దాని సమీప ప్రాంతాలు వరదలో చిక్కుకున్నాయి. ఉత్తరాదిలోని నదులపై వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది.

## బైజూస్ దివాలా ప్రక్రియ కేసులో ఈ నెల 17న 'సుప్రీం' విచారణ..!

న్యూఢిల్లీ: బైజూస్ కేసులో ఎన్‌సీఎల్ఏటీ నిర్ణయానికి వ్యతిరేకంగా యూఎస్ ఆధారిత రుణదాత గ్లాస్ ట్రస్ట్ చేసుకున్న అప్పీల్‌పై ఈ నెల 17న సర్వోన్నత న్యాయస్థానం విచారించనున్నది. ఈ మేరకు బుధవారం ధర్మాసనం అంగీకరించింది. ఎడ్ టెక్ కంపెనీ బైజూస్‌కు వ్యతిరేకంగా బీసీసీఐ బకాయిల వ్యవహారంలో రూ.158.9కోట్ల బకాయిల సెటిల్‌మెంట్‌ను ఆమోదించిన విషయం తెలిసిందే. పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనాన్ని న్యాయవాదుల



బృందం కోరింది. బైజూస్ తరఫున సీనియర్ న్యాయవాది ఎన్‌కే కౌల్ పిటిషన్‌పై ప్రస్తావిస్తూ.. వీలైనంత త్వరగా ఈ అంశంపై విచారించాలని కోరారు. బీసీసీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ కేసులో మరో పిటిషన్ సైతం దాఖలైంది. ఈ నెల 17న విచారణ జరుగుతుందని, కాబట్టి ప్రస్తుత పిటిషన్‌ను ఒకే రోజు విచారించాలని.. ఈ రెండు కేసులను శుక్రవారం విచారించాలని కౌల్ విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పిటిషన్లను 17న విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ కేసులను సెప్టెంబర్ 17న కలిసి విచారిస్తామని అమెరికాకు చెందిన రుణదాత తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. అయితే, ఆగస్టు 22న ఎడ్ టెక్ సంస్థపై దివాలా చర్యలకు సంబంధించి రుణదాతల కమిటీ (అఇఅ) ఎలాంటి సమావేశాన్ని నిర్వహించకుండా ఉండేందుకు బెంచ్ నిరాకరించింది. పిటిషన్‌పై విచారణను ఆగస్టు 27కి వాయిదా వేసింది. ఈ మధ్యకాలంలో ఎలాంటి పరిణామాలు జరిగినా.. అప్పీలేట్ ఇన్‌సాల్వెన్సీ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్ఏటీ నిర్ణయానికి వ్యతిరేకంగా అమెరికా రుణదాత చేసిన అప్పీల్‌కు ఎలాంటి అర్హత లేదని తేలితే వాటిని విస్మరించవచ్చని బెంచ్ పేర్కొంది. దివాలా ప్రక్రియలో రుణదాతల కమిటీని ఏర్పాటు చేయకుండా దివాలా పరిష్కార ప్రొఫెషనల్ (ఎఖఫ్) నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వును ఆమోదించడానికి సుప్రీం కోర్టు కూడా నిరాకరించింది.

## ఇదే బెస్ట్ డిబేట్.. కమలా హారిస్‌తో చర్చపై ట్రంప్ స్పందన

అధ్యక్ష ఎన్నికలతో అగ్రరాజ్యం అమెరికాలో రాజకీయాలు వేడెక్కాయి. డెమోక్రాట్స్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. గెలుపే లక్ష్యంగా ఇద్దరు అభ్యర్థులూ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మొదటిసారి ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. వాడీవేడిగా సాగిన ఈ డిబేట్‌లో పరస్పర విమర్శల దాడి చేసుకున్నారు. ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు.ఇక



కమలా హారిస్‌తో డిబేట్‌పై ట్రంప్ తొలిసారి స్పందించారు. ఇది ఓ గొప్ప చర్చగా అభివర్ణించారు. ఎప్పటికీ ఇది అత్యుత్తమ చర్చల్లో ఒకటిగా భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. హారిస్‌తో మరో చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఇదిలా ఉండగా.. కమలా హారిస్ కూడా ట్రంప్‌తో సెకెండ్ డిబేట్‌కు సిద్ధమైనట్లు ఉపాధ్యక్షురాలి ప్రచార చైర్ జెన్ ఓ మల్లే డిల్లాన్ తెలిపారు. అక్టోబర్‌లో రెండో డిబేట్ ఉంటుందని తెలిపారు.కాగా, నవంబర్ 5న అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్, డెమాక్రటిక్ అభ్యర్థిగా కమలా హారిస్ పోటీ పడుతున్నారు. గెలుపే లక్ష్యంగా ఇద్దరు అభ్యర్థులూ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇక భారత మూలాలున్న అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు గట్టి పోటీ ఇస్తున్నారు.ఈ క్రమంలో ఇద్దరు అధ్యక్ష అభ్యర్థుల మధ్య ఇవాళ తొలి డిబేట్ జరిగింది. ఏబీసీ న్యూస్ నిర్వహించిన చర్చలో పాల్గొన్నారు. ఆ ఇద్దరూ అనేక అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అబార్షన్లు, యుద్ధాలు, ఆర్థికం, హౌజింగ్ సంక్షోభం లాంటి అంశాలపై చర్చించుకున్నారు. రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్.. పోటాపోటీగా డిబేట్‌లో పాల్గొన్నారు. తొలుత ఇద్దరూ చర్చావేదికపై హ్యాండ్‌షేక్ ఇచ్చుకున్నారు. ఆ తర్వాత తమ విధానాలను వివరించారు.

# పారిశుద్ధ్య సేవలు నిరుపమానం



విజయవాడ, సెప్టెంబర్ 11, విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తి పదకొండో రోజుకు చేరింది.ఆగస్టు 31వ తేదీ తెల్లారేసరికి విజయవాడ నగరంలో సగభాగం బుడమేరులో కలిసిపోయింది. వారం రోజులకు పైగా వరద నీటిలోనే ఉండిపోయింది. సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రానికి విజయవాడ నగరాన్ని ఆదుకోడానికి రాష్ట్రం నలుమూలల నుంచి పారిశుధ్య కార్మికుల్ని తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.దీంతో అన్ని కార్పొరేషన్లు, పురపాలక సంఘాల నుంచి అందుబాటులో ఉన్న శానిటరీ వర్కర్లను విజయవాడకు తరలించారు. సెప్టెంబర్ 2 తేదీ నాటికి వీరంతా విజయవాడ చేరుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో పని పూర్తి చేసుకుని వెళ్లిపోతామనుకుని కుటుంబాలను వదిలి రెండు మూడు జతల బట్టలతో రాష్ట్రం నలుమూలల నుంచి కార్మికులు విజయవాడకు వచ్చారు.విజయవాడ నగరంలో వైఎస్సార్ కాలనీ మొదలుకుని మిల్క్ ప్రాజెక్టు, భవానీపురం, ఉర్మిళానగర్, కబేళా, చిట్టినగర్, పాలఫ్యాక్టరీ, వించిపేట, నైజాంగేటు, రాజరాజేశ్వరిపేట, కంసాలిపేట, అజిత్ సింగ్ నగర్ వాంబేకాలనీ, అయోధ్యనగర్, దేవీ నగర్, న్యూ ఆర్ఆర్‌పేట, పాయకాపురం, కండ్రిక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇవన్నీ విజయవాడ కార్పొరేషన్‌లో ఉన్న ప్రాంతాలు. దాదాపు రెండున్నర లక్షల కుటుంబాలు నివసిస్తున్నాయి. వీటికితోడు విజయవాడ రూరల్ మండలంలో జక్కంపూడి, కొత్తూరు – తాడేపల్లి, అంబాపురం, షాబాద్, శాంతినగర్, కవులూరు గ్రామాలను కూడా వరద ముంచెత్తింది.విజయవాడలో దాదాపు ఆరున్నర లక్షల మంది ప్రజలు వారం రోజుల పాటు వరద నీటిలో చిక్కుకోవడంతో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా వరద ప్రారంభమైన వెంటనే పారిశుధ్య కార్మికుల్ని విజయవాడకు తరలించారు. మరోవైపు విజయవాడ కార్పొరేషన్

## 10 రోజులగా విస్తృత సేవలు

పరిధిలో ఉన్న కార్మికుల్లో చాలామంది వరద బాధితులుగా మారారు. సింగ్ నగర్, పాయకాపురం, ఆర్ఆర్‌పేట ప్రాంతాల్లో నివసించే కార్మికులు కట్టుబట్టలతో నిర్వాసితులుగా మిగిలారు.నగరాన్ని ముంచెత్తిన వరదల్లో డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి అడ్డు పడిన చెత్తను తొలగించడం మొదలుకుని వీధుల్లో పారిశుధ్య పనుల వరకు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు భుజానికి ఎత్తుకున్నారువరద హెచ్చరికల నేపథ్యంలో కార్మికుల్ని విజయవాడకు తరలించాలని అప్పటికప్పుడు ఆదేశించడంతో కమిషనర్ స్థాయి అధికారులు మొదలుకుని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు విజయవాడకు వచ్చేశారు. చాలామంది కార్మికులకు కనీసం కాళ్లకు చెప్పులు కూడా లేకుండానే నగరానికి వచ్చారు. సెప్టెంబర్ 2,3తేదీల్లో కూడా విజయవాడలో వర్షం కురుస్తున్నా అలాగే పనిచేశారు.రెండు మూడు రోజుల్లో వరదలు తగ్గిపోయి, స్వస్థలాలకు వెళ్లిపోతామని భావించిన వారు 9రోజులుగా నగరంలోనే ఉండిపోయారు. కళ్యాణమండపాలు, కమ్యూనిటీ హాళ్లు, క్రీడా ప్రాంగణాల్లో వారికి వసతి కల్పించారు. ఊరు కాని ఊరులో ప్రకృతికి ఎదురొడ్డి శ్రమిస్తున్నారువీధులకు వీధులు వరద నీటిలో మునిగిపోవడంతో టన్నుల కొద్ది వ్యర్థాలను తొలగిస్తున్నారు. సోమవారం నాటికి వరద ప్రభావం కొద్దిగా తగ్గడంతో పారిశుధ్య పనుల్లో వేగం పెంచారు. రాష్ట్రంలోని వేర్వేరు మునిసిపాలిటీల నుంచి దాదాపు 7600మంది కార్మికులు విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వీధుల్ని శుభ్రం చేయడం మొదలుకుని వరద నీటిలో మునిగిపోయిన ఇళ్లను శుభ్రం చేయడం వరకు అంతా తామై శ్రమిస్తున్నారు.పారిశుధ్య కార్మికులుగా వచ్చిన మహిళలు, పురుషులు ప్రతి వీధిని ఫైర్ సిబ్బంది సాయంతో శుభ్రంగా ఉడ్చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది కార్మికులకు కనీసం కాళ్లకు చెప్పులు కూడా లేకుండానే పనిచేస్తున్నారు. గత పది రోజులుగా విజయవాడలో వాన కురవని రోజు లేదు. రెండు మూడు రోజులుగా అల్పపీడన ప్రభావంతో రోజంతా వర్షం, చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. తలలకు టోపీలు లేకున్నా, కాళ్లకు చెప్పులు లేకున్నా వరద ముంపుల్లో చిక్కిన విజయవాడను? తమ చేతులతో శుభ్రం చేస్తున్నారు.టన్నుల కొద్ది వ్యర్థాలు, తడిచి పాడైపోయిన దుస్తులు, ఆహార పదార్థాలు, పనికి రాకుండా పోయిన బెడ్డింగులు, ఒకటేమిటి అంతులేని వ్యర్థాలను చేతులతోనే ఎత్తిపోస్తున్నారు. ఇక వరద ప్రభావిత ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్న ఆహారాన్ని తినేసిన తర్వాత, మిగిలిపోయిన ఆహారాన్ని రోడ్ల పాలు చేస్తే తమ చేతులతో వాటిని ఎత్తి తరలిస్తున్నారు.పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలకు విజయవాడ నగరం ఏమిచ్చినా తీర్చుకోలేనంత రుణాన్ని కార్మికులు మిగులుస్తున్నారు. వరద సహాయక చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు పాల్గొంటున్నా అత్యధికంగా శ్రమిస్తున్నది మాత్రం పారిశుధ్య కార్మికులే. నాలుగైదు రోజుల్లో ఇళ్లకు వెళ్లిపోతామనుకున్నామని, ఇక్కడ పరిస్థితులు, వరద ముంపు వారంపైగా కొనసాగడంతో తాము కూడా ఉండిపోవాల్సి వచ్చిందని కడప నుంచి వచ్చిన కార్మికులు చెప్పారు.రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 7600మంది పారిశుధ్య కార్మికులు విజయవాడకు వచ్చారు. అధికారులతో కలిపి 10వేల మందికి పైగా నగరాన్ని తిరిగి మునుపటి స్థితికి తెచ్చేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. మధ్యలో కొద్ది గంటల పాటే విశ్రమిస్తున్నారు. త్వరగా పని పూర్తి చేస్తే ఇళ్లకు వెళ్లొచ్చనే ఉద్దేశంతో తెల్లవారక ముందే చీపుర్లు, పారలతో పనిలో దిగుతున్నారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో విధుల కోసం రెండు, మూడు జతల బట్టలతో నగరానికి వచ్చారు. ఎప్పుడు తిరిగి వెళ్లడానికి అనుమతిస్తారో తెలియదని, చేయాల్సిన పని పూర్తి చేసి వెళ్తామని కార్మికులు చెబుతున్నారు. పారిశుధ్య కార్మికులు వరద ప్రభావితప్రాంతాల్లో శుభ్రం చేసిన తర్వాత శానిటేషన్ చేస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చేస్తున్నారు. కాళ్లకు చెప్పులు, కనీస సదుపాయాలు లేకున్నా వారు అందిస్తున్న సేవల్ని చూసి విజయవాడ నగర వాసులు సెల్యూట్ చేస్తున్నారు.

# లగ్జరీ లైఫ్ నుంచి బురదోల నడిచే వరకు?

కాకినాడ, సెప్టెంబర్ 11, రాజకీయాలు అంత ఈజీ కాదు.. అదీ దక్షిణ భారత దేశంలోని తెలుగు రాష్ట్రాల్లో మరింత కష్టం. కొత్తగా రాజకీయాల్లోకి రావడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం ఉన్న నేతల వారసులే.. తిరిగి ఎమ్మెల్యేలు, ఎంపీలు అవుతున్నారు. ఇందుకు గడ్డం వెంకటస్వామి కుటుంబమే నిదర్శనం. వెంకటస్వామి తర్వాత ఆయన కొడుకులు వివేక్, వినోద్ రాజకీయాల్లోకి వచ్చారు. ఇప్పుడు వివేక్ కొడుకు వంశీకృష్ణ పెద్దపెల్లి ఎంపీగా పోటీచేసి గెలిచారు. కొత్తగా రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి ఉన్నవారు కూడా రాణించలేకపోతున్నారు. నిలదొక్కుకునే పరిస్థితులు నేటి రాజకీయాల్లో లేవు. అందుకే చాలా మంది రాజకీయం అంటేనే కంపు.. బురద అని భావిస్తున్నారు. దానిని అంటించుకోకపోవడమే మంచిదనుకుంటారు. కానీ, పవర్ స్టార్ పవన్ కళ్యాణ మాత్రం ఆ బురదనే అంటించుకున్నారు. 2008 అన్న మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీతో రాజకీయాల్లో అడుగు పెట్టారు. తర్వాత ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో పవన్ కళ్యాణ్ కాంగ్రెస్‌లో చేరలేదు. రాజకీయాల్లో అడుగు పెట్టాక వెనుకడుగు వేయడం సరికాదని భావించి సొంత పార్టీ జనసేనను స్థాపించారు. దశాబ్దం పాటు రాజకీయాల్లో ఆటుపోట్లు, ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ఆయనకు ఉన్న స్టార్ ఇమేజ్. డబ్బులు, ఫ్యాన్స్ కలిసి వచ్చాయి. చివరకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీలో కలిసి పోటీ చేసి కూటమిగా విజయం సాధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో బాగస్వామి అయ్యారు. పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. మంత్రివర్గంలో మూడు శాఖలు నిర్వహిస్తున్నారు.పది రోజులుగా ఏపీని వర్షాలు కుదిపేస్తున్నాయి. విజయవాడను వరదలు ముంచేశాయి. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇటీవల తన సొంత నియోజకవర్గం పిఠాపురంలోని కొన్ని ప్రాంతాలలో పర్యటించారు, ఆ ప్రాంతంలో వరద పరిస్థితిని అంచనా వేయడానికి వెళ్లారు. పొంగిపొర్లుతున్న నీళ్లలో నడుస్తూ కనిపించడంతో ఆయన దుస్తులు దెబ్బ తిన్నాయి. ప్రవహించే బురద నీళ్లతో ప్యాంటు కింది భాగం తడిసిపోయి కనిపించింది. ఈ వీడియో వెంటనే సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడం ప్రారంభించారు జన సైనికులు.. ఇటీవలి సినిమాలో కాళ్లకు ఖరీదైన షూ ధరించిన ఫొటోను ఒకవైపు.. మరోవైపు బురదలో నడుస్తున్న కాళ్లను మరోవైపు పెట్టి.. వైరల్ చేస్తున్నారు. ః అతను కలిగి ఉన్న జీవితం ? అతను ఎంచుకున్న జీవితం ?’ అని దానికి క్యాప్షన్ ఇచ్చారు.అయితే, ఇక్కడ కఠినమైన వాస్తవం ఏమిటంటే, ఇది పవన్ చేసిన స్పృహతో కూడిన ఎంపిక మరియు పవన్ తన సామాజిక శ్రేయస్సు కోరికలను పరిగణనలోకి తీసుకుని, తన సినిమా జీవితం కంటే ఈ కఠినమైన జీవితాన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నాడని కూడా వాదించవచ్చు. ఇందుకోసం పదేళ్లు రాజకీయాల్లో అనేక ఇబ్బందులు పడ్డారు. నిర్బంధాలను ఎదుర్కొన్నారు. వ్యక్తిగతంగాను, కుటుంబ పరంగానూ విమర్శలు తప్పలేదు. అయినా ప్రజల కోసం వాటిని ఎదురించి.. నిలబడి విజేతగా నిలిచారు.

# వైసీపీకి దూరమవుతున్న కాపులు...

తిరుపతి, సెప్టెంబర్ 11, సామాజిక వర్గాల పరంగా కాపుల ప్రభావం తాజా ఎన్నికల్లో బాగానే కనిపించింది. బాగా అనే కంటే.. కూడా ఇంకా బాగా పనిచేసిందనే చెప్పాలి. జనసేనను గెలిపించుకునేందుకు.. ముఖ్యంగా పవన్ కోసం కాపులు ఏకతాటిపైకి వచ్చారు. ఫలితంగా కాపు సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉన్న అన్ని జిల్లాల్లోనూ వైసీపీ తుడిచి పెట్టుకుపోయింది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒక్క సీటు కూడా దక్కించుకోలేదు.ఇక, రాయలసీమలో బలిజ(కాపుల్లో ఒక వర్గం) సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉన్న నేపత్యంలో ఇక్కడ కూడా ఏడు స్థానాలు మినహా.. మొత్తంగా కూటమి తుడిచి పెట్టేసింది. సహజంగా ఇంత రిజల్ట్ వచ్చినప్పుడు.. దీనిని కోల్పోయిన పార్టీగా వైసీపీ అలెర్ట్ అవ్వాలి. గతంలో 2019 ఎన్నికల్లో రెడ్డి సమాజం మొత్తం టీడీపీని వదిలేసింది. రెడ్లు బలంగా ఉన్న నియోజకవర్గాలు.. జిల్లాల్లో ఆ పార్టీ ఒక్కటంటే ఒక్క సీటును కూడా దక్కించుకోలేక పోయింది.దీంతో అలెర్ట్ అయిన చంద్రబాబు వెంటనే తన పార్టీలోని రెడ్డి నేతలను రంగంలోకి దింపి.. మంతనాలు జరిపారు. ఇదే.. తర్వాత కాలంలో రెడ్లను పార్టీకి చేరువ చేసింది. ఈ తరహా వ్యూహాలు వేయడంలో వైసీపీ విఫలమవుతోంది. తాజాగా కాపు సామాజిక వర్గం మరింతగా వైసీపీకి దూరమైంది. ఏ సమస్య ఉన్నా.. తమ వారితోనే చర్చించాలని నిర్ణయించింది. నిజానికి కాపులు.. తమ సమస్యలను రాజకీయాలకు అతీతంగా చర్చించేందుకు ముందుకు వస్తారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తారు.అలాంటిది ఇప్పుడు వైసీపీని పూర్తిగా దూరం పెట్టడానికి కారణం.. జగన్ వైఖరే కారణంగా కనిపిస్తోంది. కాపు నాయకులు పార్టీకి రాజీనామా చేస్తున్నా.. ఆయన పిలిచి మాట్లాడకపోవడంతోపాటు.. వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం.. వంటివి మిగిలి ఉన్న కొద్దిపాటి కాపు సమాజాన్ని నివ్వెరపోయే లా చేస్తోంది. ఏలూరు మాజీ ఎంపీ ఆళ్ల నాని పార్టీకి రాజీనామా చేశారు. గుంటూరు నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య పార్టీకి రాం రాం చెప్పారు.ఇలా.. కొందరు నాయకులు పార్టీని వీడినా.. జగన్ వారిని పట్టించుకోకపోవడంతో ఇక, తమకు కూడా జగన్‌తో అవసరం లేదన్నట్టుగానే కాపులు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని ఇప్పటికైనా సరిచేసుకునే ప్రయత్నం చేస్తారో.. లేక.. జగన్ మొండిగానే ఉంటారో చూడాలి.

# డీసీఎం బోల్తా

## ఏడుగురు మృతి

కాకినాడ,దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివారు చిలకా వారి పాకల వద్ద దారుణం జరిగింది. జీడిగింజలు లోడుతో వెళ్తున్న డిసిమ్ లారీ బోల్తా పడడంతో ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. టీ నరసాపురం మండలం బొర్రంపాలెం నుండి జీడిగింజల లోడుతో నిడదవోలు మండలం తాడిమల్ల వెళుతూ వుండగా చిన్నయగూడెం శివారు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. వ్యాన్ లో పదకొండు మంది వుండగా జీడీ గింజల బస్తాల కింద చిక్కుకుని ఊపిరాడక ఏడుగురు మృతి చెందారు. .నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులు సహాయంతో బస్తాల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీశారు. మృత దేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో లారీలో పదకొండు మంది ప్రయాణిస్తున్నారు. వెనుక ఎనిమిది మంది క్యాబిన్లో ఐదుగురు వున్నారు.ప్రమాదంలో మృతి చెందిన జట్టు కార్మికులు మృతులు వీరేసమిశ్రగూడెం మండలం తాడిమళ్లకు చెందిన దేవాబత్తుల బూరయ్య (40), తమ్మిరెడ్డి సత్యనారాయణ (45), పి.చినముసలయ్య (35), కత్తవ కృష్ణ (40), కత్తవ సత్తిపండు (40), తాడి కృష్ణ (45), నిడదవోలు మండలం కాటకోటేశ్వరానికి చెందిన బొక్కా ప్రసాద్ ఈ ఘటనలో మృతి చెందారు...

# ఏలేరు దబ్బకాలవకి త్వరలో మొబైల్ బ్రిడ్జి ఏర్పాటు

## ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం,పెద్దాపురం మండలంలో ఏలేరు పరివాహక ప్రాంతాల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధికారులతో కలిసి ఓ సాధారణ వ్యక్తిల షేర్ ఆటోలో పర్యటించారు. ప్రస్తుత పరిస్థితులపై అధికారుల్ని సహాయ చర్లపై వసతి పునరావాస కేంద్రాలు ఆర్మీ టీమ్ పంట నష్టం పలు విషయాలపై పెద్దాపురం ఆర్డీవో తీ. సీతారామారావుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో ఏలేరు పరివాహక ప్రాంత సమస్యలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు , మొబైల్ బ్రిడ్జి ఏర్పాటుకు నిర్మాణ వ్యయం సుమారు 50 లక్షలు ఉంటుందని కలెక్టర్ దృష్టిలో పెట్టమని జిల్లా కలెక్టర్ సగిలి సన్మోహన్ 50 లక్షల రూపాయలు నిధులు ఇస్తానని చెప్పారని త్వరలోనే మొబైల్ బ్రిడ్జి పనులను పూర్తి చేస్తామని , బ్రిడ్జి విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించిందని ఎమ్మెల్యే చినరాజప్ప తెలియజేశారు. అలాగే గ్రామస్తులతో అక్కడక్కడ చిన్నపాటి ముంపు గురైన ప్రదేశాలను ఆయన సందర్శించి అందుతున్న సదుపాయాలపై పరివాహక ప్రాంత కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు అవసరమైన మేరకు అందరూ పునరావస కేంద్రాలకి తరలిరావాలని అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా పూర్తి చేసామని అన్ని వసతులు ఉన్నాయని , ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ ఉంటుందని గ్రామస్థలి ఎవరు అధైర్య పడద్దని ఆయన తెలియజేశారు.

# శ్రీశైలంలో విరాళాలు సేకరించిన ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైలం,విజయవాడ వరద బాధితుల సహాయార్థ కోసం బిక్షాటన చేస్తూ విరాళాలను శ్రీశైలం నియోజవర్గ టిడిపి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సేకరించారు.విజయవాడలో అకాల వర్షాలకు అక్కడ ఉన్నటువంటి కాలనీలు మొత్తం వరద,బురద మయం అయ్యాయని అన్నారు. వారు పడుతున్న కష్టాలు,బాధలను చూసి సీఎం నారా చంద్రబాబు నాయుడు ఈ వయసులో కూడా ఉదయం రాత్రి తేడా లేకుండా స్వయంగా చంద్రబాబే వెళ్లి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ వరద బాధితులకు అండగా నిలుస్తున్నాడని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. విరాళాలు ఇచ్చేందుకు శ్రీశైలం నియోజకవర్గం లో ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారని కొండ ప్రాంతంలో నివసిస్తున్న చెంచులు, పోలీస్ డిపార్ట్మెంట్ సైతం విరాళాలు ఇచ్చేటందుకు ముందుకు రావడం సంతోషకరంగా ఉందన్నారు ఎమ్మెల్యే బుడ్డా.

# గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కలకలం రేపిన చిన్నారి విక్రయం

గుంటూరు , గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారి విక్రయం ఘటన కలకలం సృష్టించింది. చిన్నగంజాంకు చెందిన సుబ్రమణ్యం అనే వ్యక్తి 1.90 లక్షల రూపాయలకు తన బిడ్డను విక్రయించారు. వివరాల్లోకి వెళితే.. సుబ్రహ్మణ్యం కొద్ది రోజుల క్రితం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తన భార్య లక్ష్మిని డెలివరీ కోసం తీసుకెళ్లాడు. ఆడ శిశువుకు జన్మనిచ్చిన సుబ్రమణ్యం భార్య లక్ష్మి కన్నుమూసింది. గతంలోనే లక్ష్మికి ఎనిమిది మంది సంతానం ఉంది. అదే ఆస్పత్రిలో డెలివరీ కోసం భట్టిప్రోలుకు చెందిన మీరాభి చేరింది. డెలివరీ తర్వాత మీరాభికి పుట్టిన శిశువు ప్రాణాలు విడిచింది. అదే సమయంలో మీరాభి స్నేహితురాలు ప్రభావతి.. సుబ్రమణ్యంతో చిన్నారి కోసం సంప్రదింపులు జరిపింది. తన పాపను ఇచ్చేందుకు సుబ్రమణ్యం అంగీకరించారు.ఈ నెల 7వ తేదీన సుబ్రహ్మణ్యాన్ని ఒప్పించి శిశువును తీసుకువెళ్లేందుకు మీరాభి కుటుంబ సభ్యులతో చిన్నగంజాంకు వచ్చింది. వారు ఎట్టకేలకు సుబ్రహ్మణ్యాన్ని ఒప్పించి శిశువుని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.బిడ్డ పుట్టి చనిపోవడంతో, తీవ్ర మనోవేదనలో ఉన్న తన మిత్రురాలు మీరాభికి సుబ్రహ్మణ్యం వద్ద కొనుగోలు చేసిన శిశువును స్నేహితురాలు ప్రభావతి తీసుకువచ్చి ఇచ్చింది. బిడ్డ పుట్టి చనిపోయిన మహిళ వద్ద మరో బిడ్డను చూసి అనుమానం వచ్చి జీజీహెచ్ సిబ్బంది ప్రశ్నించారు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో బిడ్డను 1.90 లక్షలకు కొనుగోలు చేసినట్లు ప్రభావతి ఒప్పుకుంది. శిశువు కొనుగోలుపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కొత్తపేట పోలీసులు కేసును చినగంజం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

# వైకాపా నేత పాలడుగు దుర్గాప్రసాద్ అరెస్టు

గుంటుపల్లి,తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నివాసంపై దాడి ఘటనలో పాల్గొన్న వైసీపీ నేత పాలడుగు దుర్గాప్రసాద్ని పోలీసులు బుధవారం తన నివాసం గుంటుపల్లి లో అరెస్ట్ చేశారు. తనతో పాటు తన అంతరగికుడు సొనం పూడి.బాలు ని కూడా అరెస్టు చేశారు. గత కొంత కాలంగా పాలడుగు దుర్గాప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ రోజు దుర్గాప్రసాద్ గుంటుపల్లిలోని తన నివాసంలో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలుగుదేశం కార్యాలయం, చంద్రబాబు నివాసం పై దాడితోపాటు, మాజీ మంత్రి దేవినేని ఉమాపై కూడా పాలడుగు దుర్గా ప్రసాద్ దాడికి పాల్పడ్డాడని

# జిల్లాల్లో ఆ ఇద్దరే.....

విజయవాడ, సెప్టెంబర్ 11, విపక్షం వైసీపీపై వస్తున్న విమర్శలకు.. కీలక వరదల సమయంలో తమను తాము డిఫెన్స్ చేసుకునేం దుకు.. వైసీపీ తరఫున కేవలం ఇద్దరంటే ఇద్దరు నాయకులు మాత్రమే మాట్లాడుతున్నారు. వారిద్దరూ మాజీ మంత్రులే. ఒకరు పేర్ని నాని, మరొకరు అంబటి రాంబాబు. వీరిద్దరు మినహా మిగిలిన వారు ఎవరూ కూడా మీడియా ముందుకు రావడం లేదు. డిఫెన్స్ కూడా చేసుకోవడం లేదు. ఎవరికి వారు మౌనంగానే ఉండిపోతున్నారు. మరి దీని వెనుక రీజనేంటి? అనేది ఆసక్తిగా మారింది.వాస్తవానికి వైసీపీకి విజయవాడలోనే ఫైర్ బ్రాండ్ నాయకుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు వంటివారు ఉన్నారు. కీలకమైన వరదల సమయంలో వారు మాట్లాడొచ్చు. కానీ, వారిద్దరూ ఎక్కడా కనిపించ దం లేదు. ఇక, మిగిలిన నాయకులు రోజా, కొడాలి నాని.. వంటివారు కూడా మౌనంగానే ఉండిపోతున్నారు. పోనీ. పరిస్థితి ప్రశాంతంగా ఉందా? అంటే.. అదీ లేదు. అధికార పార్టీ నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. మరి ఈ సమయంలో వారు ఏం చేస్తున్నారనేది ప్రశ్న.తాజాగా వైసీపీ అంతర్గత సమాచారం ప్రకారం.. మాజీ సీఎం జగన్ అందరికీ ఫ్రీహ్యాండ్ ఇచ్చారని తెలిసింది. అంటే అందరూ మీడియా ముందుకు వచ్చి ప్రస్తుత పరిస్థితిపై వ్యాఖ్యానించాలని.. పార్టీకి ఎదుర వుతున్న ఇబ్బందులు తగ్గించాలని కూడా పేర్కొన్నారట. కానీ, కేవలం అంబటి, నానిలు మాత్రమే మీడియా ముందుకు వస్తున్నారు. మిగిలిన వారు మాత్రం తమపై ఉన్న కేసులు.. లేదా.. నియోజకవర్గాల్లో బలమైన కూటమి కేడర్ కారణం.. వెనక్కి తగ్గుతున్నారని తెలుస్తోంది.అంటే ఒక రకంగా నాయకులు భయపడుతున్నారనేది వాస్తవం. ఇప్పటికే తమపై కేసులు ఉన్న నేప థ్యంలో తాము ఇప్పుడు నోరు తెరిస్తే.. ఏదో ఒక కేసు పెట్టి ఇబ్బందులు పెట్టే అవకాశం ఉంటుందని ఒకవైపు ఆలోచనగా ఉంటే.. మరోవైపు నాయకులకు ఏం జరిగినా.. పార్టీ అధిష్టానం సైలెంట్‌గా ఉంటున్న విషయాన్ని కూడా నాయకులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తమకెందుకు బురద అంటించుకోవడం అనే ధోరణిలోనే నాయకులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే వైసీపీలో జోష్ కనిపించడం లేదని తెలుస్తోంది.

# గండి చెరువు వాగులో యువకుడు గల్లంతు

కాకినాడ,దేవరపల్లి మండలం యర్నగూడెంలోని గండి చెరువు బ్రిడ్జి వద్ద వాగులో యువకుడు గల్లంతు అయ్యాడు. అతడికోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలిస్తున్నారు. సోమవారం సాయంత్రం బ్రిడ్జి సమీపంలో మోటార్ సైకిల్ అందులో సెల్ఫోన్ వాలెట్ వుండటం స్థానికులు గుర్తించారు. పర్సులోని ఐడి కార్డు పరిశీలించగా సుబ్బరాయపురం గ్రామానికి చెందిన సిహెచ్ శాంతారావు గా గుర్తించారు. శాంతారావు వాగులో గల్లంతు అయ్యాడని భావించి గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. బుధవారం ఉదయం కుడా మృతదేహం లభ్యం కాలేదు....

## పెనమలూరులో ఎమ్మెల్యే బోడె, కలెక్టర్ బాలాజీ పర్యటన

పెనమలూరు,జిల్లాకి సంబంధించిన వరద నష్టం పై కేంద్ర కమిటీ కి నివేదిక ఇవ్వడానికి ముంపు గ్రామాలను పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తో కలిసి జిల్లా కలెక్టర్ బాలాజీ పర్యటించారు. ఈ క్రమంలో వరద బాధితులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ వరద ప్రభావానికి జిల్లాలో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది.

## ఆదోని పట్టణంలో వినాయక నిమజ్జన ఘాట్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ...



విభారె న్యూస్ ఆదోని సెప్టెంబర్ 11..... ఆదోని పట్టణంలో వినాయక నిమజ్జన ఘాట్ ను పరిశీలించిన కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ బుధవారం ఆదోని పట్టణంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్,ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తో కలిసి పర్యటించారు.ఇస్వి పోలీసుస్టేషన్ పరిధిలోని చిన్న హరి వాణనీ గ్రామ సమీపంలో ఉన్న ఎల్ ఎల్ సి కెనాల్ లో గణేష్ ఉత్సవ కమిటి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఘాట్ ను పరిశీలించారు.బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు,సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు,సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు.గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో అక్కడ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ పూజలో ఎస్పీ పాల్గొన్నారు.కెసి కెనాల్ నీటి ప్రవాహాన్ని,భారీ క్రేన్స్ ,స్విమ్మర్స్,బోట్ల ను పరిశీలించారు. ఆదోని పట్టణంలో నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు.ప్రజలకు అసౌకర్యం, ట్రాఫిక్ అంతరాయం వంటివి లేకుండా చూడాలన్నారు .నిమజ్జన సమయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అన్ని శాఖలతో సమన్వయంతో గట్టిగా పని చేయాలన్నారు .జిల్లా ఎస్పీ వెంట ఆదోని డిఎస్పీ సోమన్న,పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్య, హోంగార్డ్ డిఎస్పీ కృష్ణమోహన్ ,ట్రైన్ డిఎస్పీ ధీరజ్ ,సీఐలు ప్రసాద్,కేశవరెడ్డి,పవన్ కిశోర్,నల్లప్ప ,గంట సుబ్బారావు,గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు,ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

## చేయి చేయి కలుపుదాం

**- వరద బాధితులను ఆదుకుందాం...**

**- మల్లెల గ్రూప్స్ అధినేత(ల్బ్రేడ్ రాజు..**




విభారే న్యూస్. ఎమ్మిగనూరు సెప్టెంబర్ 11.. చేయి చేయి కలుపుదాం విజయవాడ వరద బాధితులను ఆదుకుందాం అంటూ ఎమ్మిగనూరు లో మల్లెల గ్రూప్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సహాయార్థం చేపట్టిన కార్యక్రమంలో జై భీమ్ ఎం ఆర్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్టిన్ హనుమన్న,ఎం.బి. జక్కయ్య,గర్జి.దాస్ మా వంతుగా ఆర్థిక సహాయం చేసారు.. అక్కడ తినడానికి తిండి లేక కట్టుకోవడానికి బట్ట లేక ఇబ్బంది పడుతున్న తోటి ప్రజానీకానికి మీరు కూడా మీ వంతుగా మీకు తోచిన సహాయం అందించాలని తెలియజేసారు. ఎమ్మిగనూరు మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యులు విజయవాడ కు వెళ్లి ప్రత్యక్షంగా బాధితులకు సహాయం అందించనున్నారు..

# వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయం..

**టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వరద బాధితుల కోసం 11 లక్షల అందజేసిన కెవి సుబ్బారెడ్డి కెవి సుబ్బారెడ్డి అభినందించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్**



విభారే న్యూస్ కర్నూలు ప్రతినిధి సెప్టెంబర్ 10: సీఎం రిలీఫ్ ఫండ్కు రూ.11లక్షలును ఐటీ శాఖ మంత్రి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి అమరావతి సచివాలయంలో బుధవారం కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి 11లక్షల చెక్కు అందజేశారు వరద బాధితులనుఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు, ఈ సందర్భంగా కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వరద బాధితులనుఆదుకునేందుకు ప్రభుత్వంఅన్నివిధాలా కృషి చేస్తుందని తెలిపారు ప్రజలను వరద కష్టాలనుండి బయటకు తీసుకొచ్చేందుకురాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఅహర్నిశలు కష్టపడుతున్నారనితెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి సుబ్బారెడ్డి విద్య సంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వరద బాధితులను ఆదుకోవడమే మన ముఖ్య కర్తవ్యం....

**- ఏపీడబ్ల్యూ జేఎఫ్ యూనియన్ అధ్యక్షులు షబ్బీర్ పిలుపు...**

విభారె న్యూస్ ఎమ్మిగనూరు సెప్టెంబర్ 11.. సహాయం చేయడానికి మనసు మనుషులు మన భారత దేశంలో కులమతాలకు అతీతంగా ప్రజలు ఎప్పుడు ముందుంటారని మరొక్కసారి నిరూపణ అయ్యింది. ఎమ్మిగనూరు టౌన్ అలాగే చిరు వ్యాపారస్తులు పల్లెల ప్రజలు బాధితుల కోసం విరాళాలు ఇస్తున్నా చిన్న పెద్ద అక్క తమ్ముడు పెద్దలు చిన్నవారు అందరికి పేరు పేరు న వరద బాధితులతో పాటు జర్నలిస్టుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి రోజు దిగ్విజయంగా సాగిందనీ తెలుపుతూ ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ యూనియన్ తరుపున ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన పోలీస్ డిపార్ట్మెంట్, మున్సిపల్ శాఖ, అలాగే విద్యుత్ శాఖ వారికీ జర్నలిస్తుల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న తోటి జర్నలిస్టు లకు,గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, మూర్తి లు ఇలియాస్ నాగరాజ్ శంకర్ మునీర్, వెంకటేష్ మిత్రులు అన్వర్ బాషా,గ్రందే గిరి షహీద్ ఆఫ్రిది, డాక్టర్ వి.రాయల్ బాబు, మహబూబ్,షేక్ష, రఘునాధ్ షెక్షవలి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## నంద్యాల పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు శ్రీ లక్ష్మీ నరసింహ యాదవ్






నంద్యాల జిల్లా న్యూస్తేదీ :11-09-2024,ఆంధ్రరత్న భవన్ నందు ఈ రోజు డీసీసీ అధ్యక్షులుగా ఏపీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి షర్మిలా రెడ్డి చేతుల మీదుగా నంద్యాల జిల్లా అధ్యక్షులుగా శ్రీ జెంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ పదవీ బాధ్యతలు అందుకోవడం జరిగింది.ఈరోజు ఏపీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి చేతుల మీదుగా పదవి బాధ్యతల పత్రాన్ని అందుకున్న నంద్యాల పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు శ్రీ లక్ష్మీ నరసింహ యాదవ్ అనంతరం మీడియా మిత్రులతో జెంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ గారు మాట్లాడుతూ నాకు ఏపీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి షర్మిల రెడ్డి గారు ఇచ్చిన భాధ్యతను తూచా తప్ప కుండా మరింత ప్రజలకు చేరువై,కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలూ కష్టపడి పని చేస్తానని,వారికి కానీ పార్టీకి కానీ,ప్రజలకు కానీ ఎల్లపుడు అందుబాటులో ఉంటూ,అన్ని విధాలా అభివృద్ధికి పాటు పడతానని,ఇప్పుడు పార్టీలో ఉన్నవారిని కలుపుకొని పోతూ, వచ్చేవారికి ఆహ్వానం పలుకుతూ,భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడం జరుగుతుంది. గతంలో కూడా రెండుసార్లు డీసీసీ అధ్యక్షులుగా సమర్ధవంతంగా పని చేసి మూడవ సారి డీసీసీ పదవిని చేపట్టడం చాలా ఆనందంగా ఉంది , 2019 లో 2024 లో నంద్యాల ఏంపీ గా పోటీ చేసి ఓటు శాతమును భారీగా పెంచుకోవడం జరిగింది.అదేవిధంగా జిల్లాలోని ఏడూ నియోజకవర్గలకు కొత్త ఇన్చార్జులను కేవలం ఏడూ రోజుల కాల పరిమితి వ్యవధిలోనే నియమించడం జరుగుతుంది. అని అదేవిధంగా బూత్ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు కొత్త జిల్లా కమిటీ వేయడం జరుగుతుంది.అన్ని రకాల డిపార్ట్మెంట్స్ కానీ,సెల్స్ కానీ,కొత్తగా నియమిం చుకోవడం ,జరుగుతుంది.కనుక పార్టీ లోని అందరూ నాయకులు, కార్యకర్తలు అందరితో మరియు పార్టీ అనుబంధ సంస్థలందరితో ఒక సారి సమావేశం ఏర్పాటు చేసుకొని ఎవరికి ఏ పదవీ బాధ్యతలు అప్పచెప్పలి అనేది జిల్లా అధ్యక్షుని నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలపడం జరిగింది.ఎవరన్నా పార్టీ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పార్టీ క్రమశిక్షణ సంఘం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ సారి వచ్చేది ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అటు కేంద్రములో ఇటు రాష్ట్రములో 2029 లో కాంగ్రెస్ అదికారములోకి రాబోతుంది.కనుక కష్టపడి పని చేస్తే అధికారం మనదే.అని అన్నారు. ఇప్పటికైనా పార్టీలోకి కష్టపడి పని చేసే వారు రావాలని.కోవర్టులకు స్థానం లేదని కరకంటిగా చెప్పారు. ?

## విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివి



రుద్రవరం. సెప్టెంబర్ 11 :విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. బుధవారంజాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రుద్రవరం రేంజ్ అటవీశాఖ సిబ్బంది రుద్రవరం అటవీక్షేత్రాధికారి వారి కార్యాలయం లో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగముగా విధి నిర్వహణ లో ప్రాణాలు కోల్పోయి అమరులు అయిన అటవీ అధికారులకు ఘనంగా నివాళులు అర్పించి వారి సేవలను కొనియాడారు. వన్యప్రాణుల వేట, ఎర్రచందనము అక్రమ రవాణ, అటవి భూముల ఆక్రమన వంటి సున్ని త అంశాల విషయంలో తగు రక్షణ చర్యలు తీసుకొంటూ సమన్వయంతొ వ్యవహరించి అటవి రక్షణలో పాటు పడాలనిసిబ్బందికి తెలియజేశారు. కార్యక్ర మంలోఅహోబిలండిప్యూటీ రేంజ్ అధికారి ముత్తు జావలి. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు మత్తర్ భాష, శ్రీనివాసులు రెడ్డి, పలువురు బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## కొల్లాయి కోసం తీసిన గుంతలో పడి చిన్నారి మృతి



రుద్రవరం.సెప్టెంబర్11 :కొల్లాయి కోసం తీసిన గుంత లో పడి చిన్నారి బాలుడు మృతి చెందిన సంఘటన చందలూరు గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన సుబ్బయ్య, మహేశ్వరి దంపతుల కుమారుడు గౌతమ్ (5 )సంవత్సరాలు. నూతన కొల్లాయి వేసేందుకు తీసిన గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు కార్చారు. వారి రోదనకు గ్రామ మహిళలు కన్నీరు కార్చక తప్పలేదు. కొల్లాయి కోసము తీసిన గుంతను పంచాయతీ అధికారులు పూడ్చకపోవడంతోనే మా పసిబిడ్డ గుంతలో పడి మృతి చెందారన్నారు. తమ కుమారుడు చనిపోవడానికి గుంతను తీసిన పంచాయతీ అధికారులు దానిని పూడిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని దీనికి బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## తగ్గిన కాన్పులు...

## నెలకు 50 కాన్పులే...

నంద్యాల 11-09-2024,× డాక్టర్ సుంకన్న ఉన్న సమయంలో కాన్పులు సెంచరీ దాటాయి.× ఇప్పుడు ముగ్గురు మహిళ గైనకాలజిస్ట్ లో ఉన్న సెంచరీలో సగం కాన్పులు కూడా జరగడం లేదు.× ఇది డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న దుస్థితిడోన్ తెలుగు వార్త: డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య భారీగా తగ్గిపోయింది ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా సాధారణ సిజరిన్ కాన్పులు సంఖ్య పెరగడం లేదు, కాన్పులకు ముగ్గురు మహిళ డాక్టర్లు ఉన్నా కాన్పుల పరిస్థితి దారుణంగా ఉంది గత సంవత్సర కాలంగా డోన్ ప్రభుత్వాసుపత్రిలో నిలుకొన్న పరిస్థితి ఇది. ముగ్గురు మహిళ డాక్టర్లు ఉన్నా వారు సక్రమంగా డ్యూటీలకు హాజరు కావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. వచ్చినా కూడా కానుపుల కేసులను కర్నూలు కు అధికంగా పంపుతున్నట్లు బహిరంగనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుకి 300 నుంచి 500 దాకా ఓపి ఉన్న ఆసుపత్రిలో నెలకు 50 మించి కాన్పులు జరగడం లేదంటే ఇక్కడి డాక్టర్ల నిర్లక్ష్యం తీవ్రంగా ఉందని అర్థమవుతుంది. గత ఐదు సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ గా ఉన్న డాక్టర్ సుంకన్న ఉన్న సమయంలో కాన్పులు నెలకు వందకు పైగా ఉండేవి అలాగే డాక్టర్ సుంకన్న 24 గంటలు అందుబాటులో ఉండేవాడని వైద్యానికి వచ్చిన వారు ఆరోపిస్తున్నారు...

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**